విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

కడలి మంగమ్మ ధన్యజీవి

విశాలాంధ్ర -భీమవరం: తుదిశ్వాస వరకు సీపీఐ కోసం పరితపించిన కడలి మంగమ్మ ధన్యజీవి అని ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు అన్నారు. సీనియర్ సీపీఐ నాయకులు కడలి గంగిశెట్టి సతీమణి మంగమ్మ ప్రథమ వర్ధంతిని నౌడూరు గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగమ్మ తన భర్త కడలి గంగిశెట్టి అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ నిర్వహించిన అన్ని ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీ పై నిషేధం ఉన్న రోజుల్లో పార్టీ అగ్రనేతలు కడలి గంగిశెట్టి దంపతులు ఆశ్రయం కల్పించారని అన్నారు. లోసరి-గూట్లపాడు సిపిఐ భూపోరాటాల్లోను, తీరప్రాంత డీఫారెస్ట్ భూ పంపకాల్లో జరిగిన పోరాటాల్లోనూ, కాళీపట్నం జమిందారీ భూపోరాటాల్లోను నాటి అగ్రనాయకులు వంక సత్యం, నెక్కంటి సుబ్బారావు, నాడిడి సాంబమూర్తి తదితర నాయకులతో భర్తతో కలిసి ఆమె పాల్గొని ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని చెల్లబోయిన కొనియాడారు. కార్యక్రమంలో కడలి గంగిశెట్టి, కడలి మృత్యుంజయుడు, కడలి సత్యనారాయణ, లింగం సత్యనారాయణ, యాళ్లబండి సత్యనారాయణ, కేతా శ్రీను, దొమ్మేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సినీ రంగంలో కైకాలది ప్రత్యేక శైలి

విశాలాంధ్ర-భీమవరం: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నాటి వ్యవస్థాప కుడు గరికపాటి రాజారావు ప్రోత్సాహంతో నాటక రంగం నుండి సినీ రంగానికి వెళ్ళిన కైకాల సత్యనారాయణది ఒక ప్రత్యేక శైలి అని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సీతారాం ప్రసాద్ అన్నారు. ఆదివారం సినీ నటుడు కైకాల సత్యనారాయణ సంతాప కార్యక్రమాన్ని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 775 సినిమాల్లో నటించిన కైకాల తన సినిమా జీవితంలో నాయకుడుగా ప్రతినాయకుడిగా క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేయలేని పాత్ర అంటూ లేదని కొనియాడారు. విలన్ హీరో పాత్రల్లో కూడా హాస్యం మిళితం చేసి నటించడం ఆయనకే సాధ్యమని ఎంతో కష్టపడి స్వశక్తితో సినీ రంగంలోని నిలదొక్కుకొన్న నటుడన్నారు. ఫోకస్ అధ్యక్షులు గొన్న బత్తులు మల్లేశ్వరరావు కళా రంజని జవ్వాది దాశరధి శ్రీనివాస్, పులఖండం ఉగాది తదితరులు మాట్లాడుతూ సినిమా రంగంలో నటుడుగానే కాకుండా నిర్మాతగా ఎన్నో ప్రతిభావంతమైనటువంటి సినిమాలు తీశారని, ఎంపీగా పోటీ చేసి విజయం సాధించా రన్నారు. కార్యక్రమంలో పోసింసెట్టీ మురళి, కాటి వెంకటరత్నం. ఎం.రమణ నృత్య కళాకారులు పాల్గొన్నారు.

చలపతిరావు మృతి నాటక, సినీ రంగాలకు తీరనిలోటు

విశాలాంధ్ర -భీమవరం: ఒంగోలుకు చెందిన చలపతిరావు ఎన్నో నాటకాలు వేసి అనేకమంది ప్రోత్సాహంతో చిత్రసీమలో అడుగుపెట్టారని, ఆయన క్యారెక్టర్ ఆర్టిస్టుగా సినీ రంగంలో పేరుపొందారని ఆయన మృతి నాటక సినీ రంగాలకు తీరనిలోటని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్, ప్రజా నాట్య మండలి కళాకారులు సంతాపం తెలిపారు.

బీచ్‌లో విద్యార్థుల గల్లంతు

విశాలాంధ్ర-మొగల్తూరు: పేరుపాలెం బీచ్ లో ఇద్దరు విద్యార్థులు రాజేష్,అరవిందు గల్లంతయ్యారు. మొగల్తూరు మండలం కే.పి పాలెం కు చెందిన యువకులు గా గుర్తించారు. రాజేష్ పుట్టిన రోజు వేడుకలకు బీచ్ కు వచ్చి స్నానం చేస్తూ ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. గజ ఈతగాళ్లతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

రంగరాజు మాస్టర్‌కు ప్రపంచ తెలుగు సంఘం ప్రశంసాపత్రం

విశాలాంధ్ర-ఉండి: కవి, రచయిత, సాహితీవేత్త లయన్ గాదిరాజు రంగరాజు తన కవితను ఆలపించి నందుకు విజయవాడ పి. బి సిద్దార్థ ఆ ఆర్ట్స్ కళాశాల లో రెండు రోజుల పాటు జరిగిన 5వ ప్రపంచ తెలుగు రచయితల సదస్సులో ప్రశంసా పత్రం, జ్ఞాపిక, గమ్యం-గమనం పుస్తకం అందుకున్నట్లు ఆదివారం తెలిపారు. కృష్ణా రచయితల సంఘం, ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా), తానా ప్రపంచ సాహిత్య వేదిక, సిలికా నాంధ్ర, సిద్ధార్థ అకాడమి సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో పాల్గొనే అదృష్టం తనకు దక్కిందన్నారు. సమాజ హితమే సాహిత్యం లక్ష్యం కావాలని పలువురు వక్తలు అభిప్రాయం పడ్డారని తెలిపారు. ఆచార్య కొలకలూరి ఇనాక్, ఫ్రాన్స్ దేశానికి చెందిన డానియిల్ నేజర్స్, బోట్స్ వానా కు చెందిన శ్రీదేవి శ్రీకాంత్, అమెరికాకు చెందిన తోటకూర ప్రసాద్, కూచిబొట్ల ఆనంద్, సింగపూర్‌కు చెందిన మంగిపూడి రాధిక, సినీ రచయిత బుర్రా సాయి మాధవ్, సినీ గేయ రచయిత భువన్ చంద్ర తదితర వంటి ఉద్ధండులు పాల్గొన్నారని తెలిపారు. తనకు అవకాశం కలిపించిన కృష్ణా రచయితల గౌరవ అధ్యక్షులు మండలి బుద్ధ ప్రసాద్, అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, కార్యదర్శి డాక్టర్ జి. వి. పూర్ణ చంద్ లకు రంగరాజు ధన్యవాదములు తెలిపారు.

27న పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

విశాలాంధ్ర -భీమవరం: పిల్లల హృదయ సంబంధిత వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 27వ తేదీ మంగళవారం సాయంత్రం మేంటేవారితోటలోని సుందరయ్య భవనంలో నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ వి.రాధాకృష్ణ, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.విక్రమ్ పిల్లలను పరీక్షించి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 15 సంవత్సరాల లోపు వయసు గల చిన్నారులకు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, చికిత్స కు వైద్య సహాయం అందిస్తారని వైద్య శిబిరానికి వచ్చేవారు తమ పేరు నమోదుకు 62812 25145 నెంబరులో సంప్రదించ వచ్చని వారు కోరారు.

కోడి పందాలు నిర్వహిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు

విశాలాంధ్ర-టి.నరసాపురం: కోడి పందాలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి నట్లుగా ఎస్ఐ కె. సతీష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బందంచర్ల గ్రామంలో కోడి పందాలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఆదివారం తన సిబ్బందితో దాడి చేసి నిర్వాహకుల నుండి మూడు కోడి పుంజులు, 4050 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లుగా ఆయన తెలిపారు.

ఏఐటీయూసీ పోరాటాలకు జట్లు కార్మికులు అండగా ఉండాలి

ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర - ఏలూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై ఏఐటీయూసీ నిర్వహిస్తున్న పోరాటాలు, ఉద్యమాలు, ఆందోళనలలో జట్లు లాగుడు బండ్ల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు జట్లు లాగుడుబండ్ల కార్మిక సంఘం అధ్యక్షులు పుప్పాల కన్నబాబు పిలుపునిచ్చారు. ఆదివారం ఏలూరు మెయిన్ బజారులో జట్లు లాగుడు బండ్ల కార్మిక సంఘం 50 వార్షికోత్సవ సభ సంఘ అధ్యక్షులు పుప్పాల కన్నబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో పాల్గొన్న బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏఐటీయూసీ 102 సంవత్సరాల పోరాటాల చరిత్రలో దేశ కార్మికవర్గానికి 44 చట్టాలను సాధించిపెట్టిందని తెలిపారు. 2014, 2019 ఎన్నికలలో దేశంలో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం కార్మిక వర్గం సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గాన్ని కార్పొరేట్ శక్తులకు ప్రైవేటు వ్యక్తులకు దాసోహం చేసే విధంగా మార్చిందని అన్నారు. దేశంలో కోట్లాదిమంది ముఠా, హమాలి కార్మికులు సరైన చట్టం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో ముఠా కార్మికులకు సమగ్ర చట్టం కోసం ఏఐటీయూసీ నిర్వహించే పోరాటాలలో ఏలూరు జట్లు, లాగుడు బండ్ల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఏలూరులో బజార్ జట్లలో ఏఐటీయూసీ గతంలో పెద్ద సంఘంగా ఉండేదని మరలా సంఘానికి పూర్వ వైభవం తీసుకురావడానికి సభ్యులందరూ నాయకత్వానికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కన్నబాబు గత సంవత్సర కాలంగా సంఘం నిర్వహించిన కార్యకలాపాలు నివేదిక ప్రవేశపెట్టారు. సంఘ కోశాధికారి పి. శ్రీనివాస్ సంఘం జమా ఖర్చులను సమావేశంలో చదివి వినిపించారు. సంఘ సభ్యులు కార్యకలాపాలు రిపోర్టును జమా ఖర్చులను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో సంఘ గౌరవ అధ్యక్షులు వెంకట్రావు, ఏఐటీయూసీ నాయకులు కడుపు కన్నయ్య, సంఘ సహాయ కార్యదర్శి ఎస్.సోమేశ్వరరావు తదితరులు మాట్లాడారు. సమావేశంలో సంఘానికి అధ్యక్షులుగా పుప్పాల కన్నబాబు, కార్యదర్శిగా వంగలపూడి గంగరాజు, కోశాధికారిగా పి. శ్రీనివాస్, పాత కమిటీ సభ్యులను మరో ఏడాది పాటు కొనసాగించాలని నిర్ణయించారు. సమావేశానికి పర్యవేక్షకులుగా సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య హాజరయ్యారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - కైకలూరు : లోకరక్షకుడైన ఏసు ప్రభువు ఈలోకంలో ఉదయించిన ఈరోజు ప్రపంచ వ్యాప్త పర్వదినం అని క్రీస్తు బోధనలు విశ్వవ్యాప్తంగా ఆచరణీయాలని కైకలూరు శాసనసభ్యులు దూలం నాగేశ్వర రావు పేర్కొన్నారు. కైకలూరు మండలం భుజబలపట్నం లూక్ మెమోరియల్ బాప్టిస్టు దేవాలయంలో జరిగిన క్రీస్తు జన్మదిన వేడుకలలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరుణామయుని జననం జరిగిన ఈరోజు ప్రపంచ మానవాళి కి శుభదినం అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గురజాల రామతులసి,గ్రామ పెద్దలు ముసునూరి సీతారామరాజు,ఎంపిటిసి సభ్యులు పెన్మెత్స సూర్యనారాయణ రాజు,మండల కో ఆప్షన్ సభ్యులు సోమల శ్యామ్ సుందర్,ఉప సర్పంచ్ జంగం మోషే, నాయకులు, విశ్వాసులు పాల్గొన్నారు.

లింగపాలెంలో : క్రిస్మస్ వేడుకలను లింగపాలెం మండలంలోని అన్ని గ్రామాలలో చర్చిలలో ఘనంగా జరిపారు. క్రీస్తును ఆదర్శంగా తీసుకోవాలని బోధకులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రతి చర్చిలో కేక్‌లను కట్ చేశారు. క్రైస్తవ గీతాలను ఆలపించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చర్చిలలో విశ్వాసులు సందడి చేశారు. బాణాసంచా కాల్చారు. ప్రజలు శాంతి సామరస్యాలతో క్రీస్తును అనుసరించాలని మత గురువులు ప్రసంగించారు.

కుక్కునూరులో : కుక్కునూరు గ్రామంలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత సర్పంచ్ రావు మీనా వినోద్, సిఐ సత్యనారాయణ, ఎస్ఐ వి.శ్రీనివాస రావు, వైసీపీ మండల అధ్యక్షులు కుచర్లపాటిం నర్సింహరాజు కేకు కటింగ్ చేసి అక్కడికి వచ్చిన ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏసుక్రీస్తు అంటే శాంతి, సంతోషం, త్యాగం, ప్రేమ, కరుణకు తార్కాణంగా మనమంతా కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా క్రిస్మస్ పర్వదినాన్ని జరుపుకుంటున్నామని, ఇది శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా మండల కన్వీనర్ మల్లేలా చంటి నాయుడు, నాయకులు రావు వినోద్, కుచర్లపాటి కృష్ణమరాజు, చిన్న నర్సింహారాజు, మొకరాల హరీష్, జక్కం నాగేశ్వరరావు, సూర్ల అనిల్ కుమార్, ఊట్కూరి సతీష్, అయితా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో : ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరించాలని టిడిపి పట్టణ అధ్యక్షుడు జేష్ఠ రామకృష్ణ అన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా కొయ్యలగూడెం, పరింపూడి ఎస్సి కాలనీలలో 600 కుటుంబాలకు టిడిపి పట్టణ అధ్యక్షుడు జేష్ఠ రామకృష్ణ పార్టీ నాయకులతో కలిసి స్వీట్ బాక్స్ లను ప్రతి ఇంటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో అత్యధికంగా జరుపుకునే పండుగ క్రీస్తు పుట్టుక అన్నారు. ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు మార్గంలో నడుచుకోవాలని ఒకరికి ఒకరు సహాయ సహకారాలు అందచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు పూలపల్లి వెంకటరావు, బొబ్బర చిన్న రాజు, గుడిమెట్ల శేషారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో: మండల పరిధిలోని కనసానపల్లి పరిశుద్ధ పౌలు సిఎస్ఐ దేవాలయంలో ఆదివారం తెల్లవారుజామున గం.4 నుంచి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాస్టర్లు కె.ఐజక్ జాన్, సి.హెచ్.శశిధర్, కొల్లూరి మార్కు, మాట్లాడుతూ ప్రేమ తత్వమే క్రీస్తు మార్గమని ప్రతి ఒక్కరూ తోటివారితో ప్రేమానురాగాలతో జీవనం సాగిస్తే సమాజానికి మేలు జరుగుతుందని తెలిపారు. క్రిస్మస్ ప్రత్యేక కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

పోడూరులో : పోడూరులోని నూతన ఎరూసలేం జూబ్లికల్ బాప్టిస్ట్ చర్చి వద్ద ఆదివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు, మహిళలు ఆలపించిన క్రీస్తు గీతాలతో వేడుకలు ప్రారంభం కాగా పాస్టర్లు రుద్రరాజు శ్రీనివాసరాజు, ఆర్. మోజెష్ దైవ సందేశం వినిపించారు. దేవుని ఆత్మతోను సత్యంతోను ఆరాధించాలని దేవుని ఆరాధించేవారు దేవుని అనుగ్రహం పొందుతారని పాస్టర్ శ్రీనివాసరాజు అన్నారు. ఈ సందర్భంగా జరిగిన చిన్నారుల నృత్యాలు చిన్నారులు పలికిన దైవ వాక్యాలు విశ్వాసులను ఎంతగానో ఆకట్టుకున్నాయి వేడుకలలో పాస్టర్ మోజెస్ క్రిస్మస్ కేకును కట్ చేశారు.

టి .నరసాపురం : క్రీస్తు బోధనలు అనుసరణీయమని మండల యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ సంఘం అధ్యక్షులు జి. జ్ఞాన్ రాజు తెలిపారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ప్రకాషనగర్‌లోని షాలేము సహవాస ప్రార్థనా మందిరంలో ఆదివారం కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని మర్రిగూడెం, మక్కినవారి గూడెం, టి. నరసాపురం, పుట్రేపు,కేతవరం తదితర గ్రామాల్లోని ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతిఒక్కరూ తోటివారి పట్ల ప్రేమ, దయాగుణం కలిగి ఉండాలన్నారు. ఆయా కార్యక్రమాలలో పాస్టర్లు కె. నిరీక్షణరావు, సిహెచ్ హెూషేయ, టి. ప్రసన్న కుమార్, డి. ప్రసన్న రాజు, సిహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడులో : ఉంగుటూరు మండలం నల్లమాడు గ్రామ ఉపసర్పంచ్ ఇల్లిందల సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ యేసు అందరికీ ప్రభువు అని, ఏసుక్రీస్తు సన్మార్గంలో అందరూ నడవాలి అన్నారు. తొలుత ధర్మరాజు క్రిస్మస్ కేకును కట్ చేశారు. క్రైస్తవ సోదరులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

వేలేరుపాడులో : ఏసుక్రీస్తు పుట్టినరోజు సందర్భంగా క్రిస్మస్ వేడుకలను ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. వేలేరుపాడు, ఎర్రబోరు, శివకాశీపురం, భూదేవిపేట, బండ్లబోరు, మేడేపల్లి తదితర స్థానిక గ్రామాలలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ రంగులతో పాటు విద్యుత్ దీపాలతో చర్చిలను అందంగా అలంకరించారు.

మిర్చి రైతుల కష్టాలు

దిగుబడులు ఆశాజనకం.. ధర నిరాశాజనకం

విశాలాంధ్ర - లింగపాలెం : గిట్టుబాటు ధర లేక పచ్చిమిర్చి రైతులు అల్లాడుతున్నారు. ధర నిలకడగా ఉండటంలేదని రైతులు వాపోతున్నారు. మిర్చి పంటపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతన్నలు అనుకూలమైన పరిస్థితులు లేక దిగాలు చెందుతున్నారు. ఈ సీజనులో ప్రతీరోజూ వంద టన్నులు మిర్చిని ముంబాయికి ఎగుమతి చేసేవారు. ఈ ఏడాది ముంబాయి వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ముందుకు రాలేదు. తోటలు కోతకు సిద్ధంగా ఉన్నాయి. కోసిన కాయలను అలాగే ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. గత ఏడాది తామర పురుగు సోకి వేలాది ఎకరాలలో వేసిన తోటలు దెబ్బతిన్నాయి. దీనివల్ల రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ఎకరాకి 70 వేల నుంచి 80 వేల వరకు నష్టం వచ్చింది. ఈ ఏడాది అనుకూలంగా ఉంటుందనుకున్నా రైతన్నలకు నిరాశే ఎదురైంది. తుఫాను వల్ల తోటలను ఆలస్యంగా వేశారు. ఈ ఏడాది పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని, ధర నిలకడగాలేదని అంటున్నారు. వెయ్యి నుంచి 1100 రూపాయలులోపే 60 కిలోల బస్తా ధర ఉంటుందని, కనీసం 1500 రూపాయలు ధర ఉంటే గిట్టుబాటు అవుతుందని రైతులు కోరుతున్నారు. బస్తా మిర్చి కోస్తే కూలీలకు ఇచ్చే ధర రావటంలేదని అంటున్నారు. గిట్టుబాటు ధర లేకపోవటంతో కోతలు నిలిపివేస్తున్నారు. ఏలూరు జిల్లాలో పండించిన పచ్చిమిర్చికి ఇతర రాష్ట్రాలలో మంచి డిమాండు ఉంటుంది. ఈ ఏడది అటువంటి డిమాండు లేదు. విక్రయాలు జరిగితేనే రైతులకు ఉపయోగం ఉంటుంది. పండిన పంటను విక్రయించటానికి మిర్చి పండించే రైతన్నలు నానా తంటాలు పడుతున్నారు. కాలం అనుకూలించాలంటూ ఆశతో ఎదురు చూస్తున్నారు.

ముగిసిన నృత్యభారతి వార్షికోత్సవాలు

విశాలాంధ్ర - ఏలూరు : అభినయ నృత్యభారతి, ఏలూరు 27వ వార్షికోత్సవాలు స్థానిక వై. ఎం. హెచ్. ఏ హాల్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. హేలాపురి లయన్స్ క్లబ్ సర్వీస్ ట్రస్ట్, హిందూ యువజన సంఘం, లయన్స్ జిల్లా 316జి, నెహ్రూ యువకేంద్రం సహకారంతో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు మూడు రోజులుగా జరిగి హేలాపురి ప్రజలకు నాట్య విందును అందించాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన యువ శాస్త్రీయ నర్తకులు 15 మందికి నృత్య కౌముది, 8 మంది సేవా తత్పరులకు సేవాతపస్వి, 10 మంది నాట్యాచార్యులకు సేవా తపస్వి అవార్డులు అందించారు, 300 మంది చిన్నారులకు నృత్యపోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. చివరిరోజు కార్యక్రమంలో కలకత్తా కు చెందిన అతనుదాస్, కరుణా కేతన్ భక్త భరతనాట్యం, శ్రీజయని ఘోష్ మోహిని అట్టం, సిర్పూర్ కు చెందిన గురుదేవ్ పేరిణి శివతాండవం, విజయవాడకు చెందిన శృతిసమన్వి, వరంగల్ కు చెందిన శ్రీజ ఆంధ్రనాట్యం, హైదరాబాద్ కు చెందిన రిత్విక్ వెంకట్, చార్మిళ వెంకట్ లు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసాయి. శైవ క్షేత్రం పీటాధిపతి శ్రీ శ్రీ శ్రీ శివ స్వామీజీ ముఖ్య అతిథిగా విచ్చేసారు. మూడు రోజులు ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించిన నాట్యాచార్య లయన్ దువ్వి హేమసుందర్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ సిహెచ్.సత్యనారాయణమూర్తి, ఎల్.వెంకటేశ్వర రావు,అఖిల భారత తెలుగుసేన రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ చౌదరి,జాతీయ మహిళా అధ్యక్షురాలు సిహెచ్. శ్రీదేవి,మలేసియా భరత నాట్య గురువు శ్రీగణేషన్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదాలు

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : దేవరపల్లి నుండి జీలుగమిల్లి వరకు నూతనంగా నిర్మించిన జాతీయ రహదారి పై అధిక లోడుతో ఓవర్ టాక్ చేసుకుంటూ అతి వేగంగా చెరకు లోడుతో ట్రాక్టర్లు, లారీలు వెళ్లడంతో వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ రహదారిపై ప్రయాణించాలంటే ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణాలు చేయవలసి వస్తుందని, సంబంధిత అధికారులు ట్రాక్టర్ డ్రైవర్లకు, లారీ డ్రైవర్లకు సూచనలను ఇస్తే బాగుంటుందని ప్రయాణికులు వాపోతున్నారు. కొయ్యలగూడెం నుండి జంగారెడ్డిగూడెం పట్టణాల మధ్య గల జాతీయ రహదారి విస్తీర్ణం చేసి నూతనంగా రహదారి నిర్మించడంతో వాహన చోదకులు అతి వేగంగా ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. దీనిలో భాగంగా చెరకు సీజన్ కావడంతో లారీలపై, ట్రాక్టర్ల పై అధిక లోడు 10 నుంచి 18 టన్నుల వరకు చెరకు లోడుతో వేగంగా ప్రయాణలు కొనసాగిస్తున్నారు. ద్విచక్ర వాహనాలపై, ఆటోలపై, వెళ్లే ప్రయాణికులు, అధిక లోడుతో వెళుతున్న చెరుకు వాహనాలను చూసి భయభ్రాంతులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు అధిక లోడుతో వెళుతున్న వాహన చోదకులపై తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నాలుగు చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు

విశాలాంధ్ర - కుక్కునూరు : మండలంలోని రైతు భరోసా కేంద్రాల పరిధిలో నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఏవో బాలాజీ తెలిపారు. మండలంలోని శ్రీధర్,తొండిపాక,చీరవెల్లి, కుక్కునూరులతో కలిపి 4 చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసామన్నారు. ప్రభుత్వం మద్దతు ధర గ్రేడ్ ఏ రకానికి రూ. 2060, సాధారణ రకాలకు రూ. 2040 లకు కొనుగోలు చేస్తామన్నారు.

ఇరువురి మృతికి కారణమైన వాహనం కోసం గాలింపు

విశాలాంధ్ర - లింగపాలెం : కె.గోకవరం-పుప్పాలవారిగూడెం సరిహద్దుల సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఇద్దరు మృతి చెందిన సంఘటనపై ధర్మాజీగూడెం ఎస్ఐ చెన్నారావు దర్యాప్తు చేస్తున్నారు. శనివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో అశ్వారావుపేటకు చెందిన ఆరేపల్లి సాయిబాబా(43), ఎస్.భాస్కరరావు(44) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటనలో కె.గోకవరంకు చెందిన ఎం.రాంబాబుకు గాయాలయ్యాయి. ఇతను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తాపీ పని చేసుకుని జీవిస్తున్న వీరు ముగ్గురు తమ పని నిమిత్తం ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రాంతంలో ప్రమాదానికి గురై ఇరువురు అక్కడికక్కడే మృతి చెందటంతో స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. గుర్తు తెలియని వాహనాన్ని తెలుసుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఈ మార్గంలో ఇటీవల గడ్డి లోడుతో ట్రాక్టర్లు వెళ్తున్నాయని స్థానికుల సమాచారం. ఈ దిశగా దర్యాప్తు చేస్తున్నారు. త్వరలో ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే మాటల్ని అపార్థం చేసుకోవద్దు

విశాలాంధ్ర - ఆగిరిపల్లి : ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు ఇటీవల ఈదరలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ వరుసకు తాటి చెట్టు, బొప్పాయి చెట్టు అని వాడుక భాషలో అన్నారని ఆగిరిపల్లి మండల వైఎస్ఆర్సిపి నాయకులు పేర్కొన్నారు. దానికి అర్థం తెలుగుదేశం పార్టీలో ఉన్న వ్యక్తులకు నీడ తోడు కరువైందని, తాటి చెట్టు బొప్పాయి చెట్టు నీడలో ఇద్దరు ముగ్గురు కన్నా ఎక్కువ ఉండరని అర్థం అని, నూజివీడు టిడిపి బీసీ సెల్ నాయకుడు దానిని అపార్థం చేసుకున్నారని పేర్కొన్నారు. ఆ మాటలను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కృష్ణాజిల్లా చైర్మన్ ఒక గౌడ సామాజిక వర్గం అని, ఉమ్మడి కృష్ణాజిల్లా మంత్రిగా ఒక గౌడ సామాజిక వర్గం వ్యక్తి అని, ఆగిరిపల్లి మండల పార్టీ అధ్యక్షుడు గౌడ సామాజిక వర్గం అని, మండలంలో 25 పంచాయతీలకుగాను ఆరుగురు గ్రామ పార్టీ అధ్యక్షులుగాను ఇద్దరు సర్పంచులు గాను ఒక ఎంపీటీసీ గాను ఉన్నారని తెలిపారు. గౌడ సామాజిక వర్గం మీద ఎమ్మెల్యేకు గౌరవం ఉందని, దీన్ని తట్టుకోలేక పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పల్లగాని రమాదేవి, జమదగ్ని, చిన్న ఆగిరిపల్లి సర్పంచ్, కందుల మల్లేశ్వరి విక్రం నూగొండపల్లి సర్పంచ్, వాకాసకేశ్వర రావు నూజివీడు నియోజకవర్గం సోషల్ మీడియా కో కన్వీనర్, పామర్తి అనిల్ కుమార్ ఈదర గ్రామ పార్టీ అధ్యక్షులు పరసా రవిబాబు కొమ్మూరు పార్టీ నాయకులు శ్రీనివాసరావు, శోభనాపురం గ్రామ పార్టీ అధ్యక్షులు, మల్లవల్లి వెంకటేశ్వరరావు, కొండపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొల్లులో ఇదేం ఖర్మ రాష్ట్రానికి

విశాలాంధ్ర - పాలకొల్లు : పాలకొల్లు పట్టణం 20వ వార్డులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. వార్డులో ఇంటింటికి తిరిగుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని నమోదు చేసుకున్నారు. పలువురు వికలాంగులు వృద్ధులు పేదలు తమ సమస్యలను ఎమ్మెల్యే నిమ్మలకు తెలియజేశారు. పరిష్క రించే దిశగా ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలను దోచుకుంటున్నారు

విశాలాంధ్ర -నూజివీడు: ప్రతి ఒక్క పేదవాడికి జీవన ప్రమాణాలు పెంచుతా నన్న జగన్ రెడ్డి ఎన్నికల అనంతరం వారిని దోచుకోవడం పనిగా పెట్టుకున్నాడని ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అంటూ నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడు పట్టణంలోని 8,9వ వార్డులలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నూజివీడు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గపు పాలన సాగుతుందని ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారిని పోలీసుల అండదండలతో నోరు మూయించుతున్నారు తప్ప రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకునేవారు కానరావడం లేదన్నారు. అవ్వ తాతలకు పెన్షన్ పెంచి ఇస్తానని హామీ ఇచ్చిన జగన్ రెడ్డి నేడు పెన్షన్లు, రేషన్ కార్డులు ఏ విధంగా తీసివేయాలో పథక రచన చేస్తున్నారన్నారు. నూజివీడు పట్టణంలో తరతరాలుగా అనుభవంలో ఉండి నిషేధిత జాబితాలో ఉన్న భూములను తమ (టీడీపీ) ప్రభుత్వం వస్తే నిషేధిత జాబితా నుండి తొలగిస్తామని ఈ సందర్భంగా వార్డు ప్రజలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నూజివీడు రూరల్ మండల పార్టీ అధ్యక్షులు ముసునూరు రాజా ,పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మలి శెట్టి.జగదీష్ , రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ నాయకులు బాణావతు బద్రు నాయక్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం జగన్.. పాలన చేతకాకపోతే గద్దె దిగండి

విశాలాంధ్ర - పాలకొల్లు: పట్టణం 20వ వార్డులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. వార్డులో ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. పలువురు వికలాంగులు, వృద్ధులు పేదలు తమ సమస్యలను ఎమ్మెల్యే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి పరిపాలన చేతకాకపోతే పదవి నుండి దిగిపోవాలని పాలకొల్లు ఎమ్మెల్యే రామానాయుడు అన్నారు. ఆదివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పరిపాలన ఎలా చేయాలో చేతకాక, సంపద సృష్టించలేని సీఎం ప్రజలపై పెను భారం వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెచ్చెట్టి బాబు స్థానిక ప్రజలు టిడిపి నాయకులు పాల్గొన్నారు.